www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 19 అక్టోబర్ 2025

నకిలీ మద్యం కేసు నిందితులకు ముగిసిన కస్టడీ

- పోలీసుల అదుపులోనే ప్రధాన నిందితుడు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నకిలీ మద్యం కేసులో రిమాండ్‌లో ఉన్న పదిమంది నిందితులను శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం, శనివారం ఈ పదిమంది నిందితులను ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిట్ బృందంలోని సిఐ శ్రీనివాసన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర విచారించారు. శనివారం సాయంత్రం తొమ్మిది మంది నిందితుల కస్టడీ ముగియడంతో వారిని తిరిగి సబ్ జైలుకు తరలించారు. ప్రధాన నిందితుడు కట్టా సురేంద్ర నాయుడును మూడు రోజుల కస్టడీకి కోరడంతో కోర్టు అనుమతించింది. అతన్ని మాత్రం ఎక్సైజ్ పోలీసులు అదుపులో పెట్టుకున్నారు. ఆదివారం మరోసారి నిందితుడిని విచారించి సబ్ జైలుకు పంపుతామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కస్టడీలో ఎలాంటి విషయాలు రాబట్టారు, కేసు దర్యాప్తు ఎంతవరకు ముందుకు వెళ్ళింది. ఇంకా ఎవరెవరి పాత్రలు ఉన్నాయనే అంశాలను ఎక్సైజ్ పోలీసులు వెల్లడించలేదు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఇన్వెస్టిగేషన్ అధికారులు తెలిపారు.

బాణాసంచా..ధరల మోత...

- ఆకాశాన్నంటిన టపాసుల ధరలు
- లైసెన్స్ ఫీజుల పెంపుదలే కారణం
- కన్పించని సందడి
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- భద్రత ప్రమాణాలు పాటించని దుకాణదారులు
- అధికారుల చర్యలు శూన్యం

ప్రజాశక్తి-రాయచోటి

బాణాసంచా ధరలు ఆకాశానంటుతుండటంతో జిల్లాలో దీపావళి సందడి ఎక్కడా కనిపించడం లేదు. గతంలో వారం, పది రోజుల ముందుగానే దీపావళి వాతావరణం కనిపించేది. వ్యాపారుల క్రాకర్స్ అమ్మకాలతో రాయచోటి పట్టణం, మండలాలు నిండిపోయేది. ఈసారి దీపావళి పండుగ సమీపిస్తున్నా ఎక్కడా సందడి వాతావరణం కన్పించడం లేదు. జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ ఫ్యాక్టరీలు 36 ఉండగా తాత్కాలిక షాపులకు 323 అనుమతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రాయచోటి డివిజన్‌లో 91, రాజంపేట డివిజన్‌లో 146, మదనపల్లి డివిజన్‌లో 84 తాత్కాలిక లైసెన్సులు ఇచ్చారు. జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులోని మైదానంలో 26 తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేశారు. లైసెన్స్ పొందాలంటే రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో అధిక శాతం ఛార్జీలు పెంచారు. నేడు, రేపు ఈ దుకాణాలన్నీ ఆయా చోట్ల నడుపుకోవాల్సి ఉంటుంది. వ్యాపారుల్లో లైసెన్సు ఫీజులను భారీగా పెంచేయడంతో గత ఏడాది రోజుకు రూ.500 స్థలానికి బాదుగు ఉండేది. ఇప్పుడు రోజుకు రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. భారీ స్థాయిలో పెంచేశారంటూ బాణాసంచా వ్యాపారస్తులు తీవ్ర ఆవేదనకు వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి స్టాల్స్ ఏర్పాటు చేసుకుంటున్నాం అంటున్నారు. గతంలో అత్యంత తక్కువ ధరలకు చైనా నుంచి బాణసంచాలు నాణ్యతని వచ్చేవి. ఈ సారి చైనా బాణాసంచా తయారీని ఆ దేశంలో నిషేధించడంతో పూర్తిగా స్వదేశీ బాణసంచా అమ్మకాలేనని, కొంటే ఆర్థికంగా లాభసాటి కూడా వ్యాపారులకు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.పైగా బాణసంచా ధరలు ఈ ఏడాది 20 శాతం పెరిగాయని ప్రజలు చెబుతున్నారు. ఈ ప్రభావం మొత్తం ప్రజలపైనే పడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై స్పందించి సరైన ధరలకు బాణాసంచాలను అమ్మకాలు చేసే విధంగా చర్య తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాయచోటిలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు

తెల్ల కాగితంపై టపాసుల ధరలు

ఏ దుకాణంలో అయినా వస్తువులు కొనుగోలు చేసినా ఆ దుకాణానికి సంబంధించిన దుకాణం లైసెన్స్, టిన్ నెంబరు, జిఎస్‌టి నెంబరు ముద్రించి ఉన్న కాగితంపైనే బిల్లులు వేస్తారు. ఈ టపాసుల దుకాణంలో మాత్రం అలాంటిది ఎక్కడ కనిపించడం లేదు. టపాసులు కొనుగోలు చేస్తే తెల్ల కాగితంపై టపాసులు పేర్లు రాయకుండా రేట్లు మాత్రమే వేస్తున్నారు. దీంతో కొనుగోలుదారులు ఏ టపాసుకు ఎంత రేటుఅని అర్థంకానీ స్థితిలో ఉన్నారు. అంతే కాకుండా ఈ దుకాణంలో ప్రతి ఏటా కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నా పన్నులు సరిగా ప్రభుత్వానికి చెల్లిస్తున్నారా లేదా అని అడిగే వారు కూడా లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓరిజినల్ బిల్లు పేపర్లలో బిల్లులు వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారుల చర్యలు శూన్యం

టపాసులు అసలు ధర రూ.వెయ్యి ఉంటే ఎంఆర్‌పి రూ.రెండు వేలు ముద్రించి రూ.వెయ్యి బిల్ అయితే అసలు రేటు రూ.200 అన్నట్లు, వ్యక్తులను బట్టి దుకాణాలలో టపాసుల ధరలు విచ్చలవిడిగా అమ్ముతున్నారు. అధికారులు సూచించిన ప్రమాణాలు పాటించుకున్న పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు చూస్తూ చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో అధికారుల తీరపై ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులు స్పందించి అధిక ధరల నియంత్రించి, సామాన్య ప్రజలు దీపావళి పండుగను ఆనందంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

వ్యాపారస్తులు ఎవరైనా అధిక రేటుకు అమ్ముతున్నారని ప్రజలు ఫిర్యాదు చేస్తే రెవెన్యూ, పోలీస్, తమ అగ్నిమాపక సిబ్బందితో కలిసి చర్య తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దీపావళి పండుగ ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి అన్ని చర్యలు తీసుకున్నాం.

-పి.అనిల్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి, రాయచోటి.

మున్సిపల్ ఎన్నికల వేడి షురూ!

- కడప, పులివెందులపై పార్టీల ఫీట్లు
- తెలుగుతమ్ముళ్లలో ఎడతెగని తగవులు
- పులివెందుల ఛైర్మన్ వైసిపి అభ్యర్థిగా దుష్యంత్‌రెడ్డి!?
- 28 నుంచి మున్సిపోల్స్‌పై శిక్షణా తరగతులు

జిల్లాలో మున్సిపల్ ఎన్నికల వేడి రాజుకుంటోంది. కడప కార్పొరేషన్ మేయర్, పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ పదవులకు తెలుగుతమ్ముళ్లలో నువ్వానేనా అనే రీతిలో పోటీ నెలకొన్న సంగతి తెలిసిందే. కడప కార్పొరేషన్ మేయర్ పీఠంపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ పదవికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.టెక్ రవి కుటుంబీకులు లేదా ఎంపిక చేసిన వ్యక్తులు ఉండాలనే రాజకీయాల నేపథ్యం ఉత్కంఠను కలిగిస్తోంది. ప్రత్యర్థి వైసిపి పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా చవ్వా దుష్యంత్‌రెడ్డిని దాదాపుగా ఎంపిక చేసిన దగ్గర నుంచి చాపకింద నీరులా పావులు కదుపుతోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ నెల 28న విజయవాడలో నిర్వహిస్తున్న మున్సిపల్ ఎన్నికల శిక్షణా తరగతులకు మున్సిపల్ అధికారులు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు తమదైన వ్యూహాలకు పదును పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో కడప కార్పొరేషన్, కమలాపురం, మైదుకూరు, బద్వేల్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, రాజంపేట, రాయచోటి మున్సిపాలిటీలు ఉన్నాయి. జిల్లాలోని కడప కార్పొరేషన్‌తో సహా మిగిలిన ఎనిమిది మున్సిపల్ ఛైర్మన్ పదవులు దక్కించుకోవడంపై అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి కన్నేశాయి. జిల్లాలో రాజకీయ చైతన్యం కలిగిన స్థానిక సంస్థలైన కడప కార్పొరేషన్, పులివెందుల మున్సిపాలిటీల్లో రాజకీయం వేడెక్కింది. కడప కార్పొరేషన్ పీఠంపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కుటుంబాల మధ్య ఆధిపత్యపోరు నడుస్తోంది. కడప, కమలాపురం ఎమ్మెల్యేలు తమ కుటుంబీకులుగానీ, అనుచరులు గానీ 50 కార్పొరేటర్ల స్థానాలు మొదలుకుని మేయర్ వంటి కీలక పదవులను దక్కించుకోవాలని పావులు కదుపుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కడప నియోజకవర్గంలోని అసంతృప్తుల దగ్గర నుంచి గ్రావెల్ తరలింపు వాహనాల సీజ్, జిజిహెచ్‌లోని శానిటేషన్, సెక్యూరిటీ, ఆరోగ్యశ్రీ కాంట్రాక్టుల వరకు అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. ప్రత్యర్థి వైసిపి అధికార పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులకు తమ హయాంలో నిధులు మంజూరు చేశామనే పేరిట పోటాపోటీగా రాజకీయం చేస్తుండడం ఉత్కంఠను కలిగిస్తోంది. పులివెందుల మున్సిపల్ ఎన్నికలను పరిశీలిస్తే అధికార వైసిపికి ఇటీవలి జడ్‌పిటిసి ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాల నేపథ్యంలో 33 వార్డు స్థానాలకు అభ్యర్థుల ఎంపిక, ఛైర్మన్ పదవికి అభ్యర్థి ఎంపిక వరకు జాగ్రత్తగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిని దాదాపుగా చవ్వా దుష్యంత్‌రెడ్డి పేరును దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బి.టెక్ రవి ముగ్గురు అభ్యర్థుల పేర్లను ఎంపిక చేసుకుని ప్రకటించలేని డోలాయమానంలో పడినట్లు సమాచారం. మున్సిపాలిటీలోని 33 వార్డులకు టిడిపి అభ్యర్థుల ఎంపిక విషయంలో తపస్సు చేయాల్సి ఉంటుందనే వాదన వినిపిస్తోంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ రాబోయే డిసెంబర్ మాసంలోపు రాష్ట్రంలోని మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమాయత్తం కావాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈలెక్కన ఫిబ్రవరి, మార్చి మాసాల్లోపు మున్సిపల్ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈనెల 28న విజయవాడలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన శిక్షణా తరగతులకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల రాజకీయం మరింత ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి.

డిమాండ్లు పరిష్కరించే వరకూ పోరాటం : స్ట్రగుల్ కమిటీ

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల ప్రధాన డిమాండ్లను యాజమాన్యం నెరవేర్చే వరకు దశల వారి పోరాటాన్ని నిర్వహిస్తామని రాయచోటి స్ట్రగుల్ కమిటీ నేతలు అబ్బవరం రామాంజులు, ఎవి.రమణ, సుబ్రహ్మణ్యం రాజు, బివి.రమణలు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ విజయవాడ విద్యుత్ భవన్‌లో జరిగిన చర్చల్లో కార్మికుల ప్రధాన సమస్యలు తీరకుండానే సమ్మెను విరమించడం తగదన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్లను రెగ్యులర్ చేయడం, గ్రేడ్ 2 సమస్యలు, పాత పెన్షన్ వర్తింప జేయడం తదితరాలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇవే ప్రధాన డిమాండ్లుగా జిల్లాలలోని డిస్కముల వద్ద విద్యుత్ సౌదవద్ద ధర్నాలు కూడా చేసినట్లు చెప్పారు. జెఎసి కూడా ఇవే ప్రధాన డిమాండ్లుగా సమ్మెకు పిలుపు నివ్వడంతో స్ట్రగుల్ కమిటీగా తాము కూడా సమ్మెలో భాగస్వామ్యుల మయ్యామని పేర్కొన్నారు. ప్రధాన డిమాండ్లు నెరవేరకుండానే జెఎసి సమ్మెను విరమించుకోవడం శోచనియమన్నా రు. తెలంగాణ రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతనాలు చెల్లిస్తున్నారని, వారికి అడ్డురాని చట్టాలు, ఇబ్బందులు మన రాష్ట్రానికి ఎందుకు అడ్డు వస్తాయంటూ వారు ప్రశ్నించారు. 1.2.99 తర్వాత ఎన్నికైన ఎమ్మెల్యేలకు ఎంపీలకు కూడా రెండు, మూడు పెన్షన్లు ఇస్తున్నా రు. వారికి అడ్డురాని చట్టాలు ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ కార్మికులకు వస్తాయా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే యాజమాన్యం కార్మిక ,ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. విద్యు త్ సంస్థను ప్రయివేటీకరణ వైపు తీసుకెళ్లే విధా నా లకు వ్యతిరేకంగా సదస్సులు నిర్వహించుకుని, ప్రధాన డిమాండ్లు నెరవేరేవరకు దశల వారి ఆందోళనకు సిద్ధమవుతామంటూ వారు హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజులు

ఇఒ రవీంద్రకు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

కుక్కల బెడద నుండి కాపాడండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలో సంచరిస్తున్న కుక్కలను బయట ప్రాంతాలకు తరలించి, కుక్కల బెడద నుండి కాపాడాలని పట్టణంలోని నాయక్‌వీధి ప్రజలు కోరారు. శనివారం స్థానిక ఎంపిడిఒ మనోహరరాజు, ఇఒ వీరబల్లి రవీంద్రకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయక్‌వీధి ప్రజలు మాట్లాడుతూ వీధుల్లో కుక్కల బెడద ఎక్కువ అయిపోయిందని, చిన్నపిల్లలు, ఆడవారు బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారని వాపోయారు. వీధుల్లో నడిచేందుకు సైతం తీవ్ర భయాందోళనకు గురవుతున్నామని, పిక్కలు పట్టుకుంటే వదిలే పరిస్థితి ఉండదని ఆవేదన చెందారు. ఇటీవల కుక్క కాటుకి గురై ఓ వ్యక్తి చనిపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కుక్కలు వీధుల్లో లేకుండా బయట ఎక్కడైనా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వారు కోరారు. కార్యక్రమంలో సయ్యద్‌బాష, కువైట్ సయ్యద్ బాష, డిష్ బ్రదర్స్, హనీఫ్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే టపాసుల విక్రయాలు

- సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ నిభందనల మేరకే టపాసులు విక్రయించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి దుకాణదారులకు సూచించారు. శనివారం స్థానిక మిషన్ కాంపౌండ్, టిప్పు సుల్తాన్ మైదానంలలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, తహశీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. టపాసుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టపాసాలు దుకాణ యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులు, ఫైర్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మదనపల్లి డివిజన్ ప్రజలకు ముందుగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పండుగ సందర్భంగా పిల్లలు టపా సులు పేల్చే సమయంలో పెద్దలు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ అనుమతులు లైసెన్స్ దుకాణాదారుల వద్దే టపాసులు కొనుగోలు చేయాలని తెలిపారు. మదనపల్లె డివిజనులో 86 దుకాణాలు ఏర్పాటు చేశారని ఇందు లో పాతవి 74 కాగా, కొత్తగా 12 మందికి అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఫైర్ ఆఫీసర్ శివప్ప, వన్ టౌన్ ఎస్ఐ శివకుమార్, మున్సిపల్, రెవె న్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోచ్ అవినాష్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-పీలేరు

తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయ అనుబంధ కళాశాలల క్రీడల్లో సత్తా చాటిన సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కోచ్‌గా వ్యవహరించిన అవినాష్‌రెడ్డిని సిఎన్ఆర్ కళాశాల కరస్పాండెంట్ చింతల విజయభాస్కర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య ఘనంగా సత్కరించారు. శనివారం కళాశాల ఆవరణంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి కరస్పాండెంట్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇచ్చి యూనివర్సిటీ రాష్ట్ర, దేశీయ క్రీడా పోటీల్లో మెళకువలు నేర్పి వారి విజయానికి కృషి చేసిన అవినాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొని గెలిచిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు విద్యార్థులు ఆదిసగా అడుగులు వేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: ఆంధ్రప్రదేశ్‌లో జన, కుల గణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బోడెం రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బోడెం రాజశేఖర్ మాట్లాడుతూ విభజించి పాలించు అన్న చందంగా నాయకులు తమ పరిపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో బిసి కుల గణన చేయాలని, జనాభా దామాషా ప్రకారమే రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. తెలంగాణలో కొన్ని బిసి సంఘాల నాయకులు రాజకీయ పార్టీ నాయకులకు అమ్ముడుపోయి 42శాతం బిసి రిజర్వేషన్ చేయాలని డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బిసి 42 శాతం మందే ఉన్నారని మీకు తెలుసా అని నిలదీశారు. ఇది ఒక ఎత్తు అయితే బిసి రిజర్వేషన్లకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు ఉన్నప్పటికీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఎపిలో బిసి అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిజెఐపై దాడి అమానుషం

ప్రజాశక్తి-రాయచోటి: భారత ప్రధాన న్యాయమూర్తి సిజెఐ గవాయ్‌పై జరిగిన దాడి ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దుగ్గనపల్లి సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దారుణమైన దాడి అని, న్యాయ వ్యవస్థ గౌరవం కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత హింస, బెదిరింపులకు ప్రజా స్వామ్యంలో స్థానం లేదని,మతోన్మాదం పరాకాష్టకు నిదర్శనమన్నారు. దాడి జరిగి చాలా రోజులు అయినప్పటికీ నిందితుడిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రజలు ఇలాంటి దాడులను ఏకగ్రీవంగా ఖండించాలని కోరారు.

స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలి

- బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

స్థానిక సంస్థలలో బిసిలకు రిజర్వేషన్ కల్పిం చడం కూడా కొన్ని రాజకీయ పార్టీలకు రుచించకపోవడం దారుణమని జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జారీచేసిన జిఒపై సుప్రీం కోర్టు స్టే మంజూరు చేయడం బాధాకరమన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యా పరంగా వెనుకబడిన కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించడం కూడా కొన్ని పార్టీలకు నచ్చకపోవడం దుర్మార్గమన్నారు. బిసిలు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కోరుతు న్నారే తప్ప ఎమ్మెల్యే, ఎంపీ, సిఎం, పిఎం పదవులకు రిజర్వేషన్లు అడగడం లేదు కదా అంటూ ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఇచ్చిన జిఒపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ తెలంగాణలో చేపడుతున్న బంద్‌కు ఎపిలోని బిసిలు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న బిసిలందరూ ఏకతాటి పైకి వచ్చి ఐక్య పోరాటం చేసే రోజులు ముందున్నాయని చెప్పారు. సమావేశంలో జిల్లా బిసి సంక్షేమ సంఘం కార్యదర్శి గుల్బర్గా మహమ్మద్ ఖాజాఅలీ, జిల్లాకు కురుబ సంఘం అధ్యక్షుడు ఈశ్వరయ్య, మాజీ అధ్యక్షుడు రవిశంకర్ పాల్గొన్నారు.

రోజుకు లక్ష మద్యం బాటిళ్ల స్కానింగ్ : ఇఎస్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లాలో మద్యం అమ్మకాలు పారదర్శకంగా, నిబంధనల మేరకు జరుగుతున్నాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) మధుసూధన్ స్పష్టం చేశారు. జిల్లాలోని మద్యం దుకాణాల్లో ప్రతి రోజూ లక్ష మద్యం బాటిళ్లకు స్కానింగ్ చేసి విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. శనివారం పట్టణంలోని పలు మద్యం దుకాణాలు, బార్లను ఈఎస్ తనిఖీ చేశారు. వినియోగదారుడికి మద్యం బాటిళ్లను స్వయంగా స్కానింగ్ చేసి, అందులోని వివరాలను చూపించి విక్రయించే ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఎస్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి జిల్లాలోని 122 మద్యం దుకాణాలు, 11 బార్లలో మద్యం బాటిళ్లను స్కానింగ్ చేసి మాత్రమే విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఒక రోజుకు సుమారు రూ. 1.62 కోట్ల దాకా మద్యం వ్యాపారం జరుగుతోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా కల్తీ మద్యం లేదని, స్కానింగ్ పద్ధతి వలన వినియోగదారుడు సంతృప్తిగా మద్యం తీసుకెళుతున్నారన్నారు. పర్మిట్ రూముల్లో కిచెన్లు, రెస్టారెంట్లు నిర్వహించరాదని, దుకాణాలు సమయపాలన పాటించాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మదనపల్లె ఎక్సైజ్ సిఐ భీమలింగ, హెచ్‌సీ శ్రీనివాసులుయపాల్గొన్నారు.

న్యాయస్థానాల కోసం ప్రత్యామ్నాయ భవనాలు

- చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో న్యాయస్థానాల నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ భవనాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక పరిశీలించారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న న్యాయస్థానాల పాత భవనాలు మరమ్మతులకు గురికావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శనివారం స్థానిక కోర్టును సందర్శించి వాటి స్థితిగతులను క్షుణ్ణంగా చూశారు. ఆ భవనాలకు మరమ్మతులు చేపట్టడం జరిగితే న్యాయస్థానాల నిర్వహణ కోసం తాత్కాలికంగా అవసరమైన ప్రభుత్వ భవనాల కోసం ఆరా తీశారు. పట్టణ శివారులో పీలేరు-మదనపల్లి మార్గంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఖాళీగా ఉన్న భవనాలను, ఇతర సౌకర్యాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు 11వ ఆదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్, జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్, న్యాయ వాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు పురుషోత్తం రెడ్డి, చంద్రశేఖర్, న్యాయవాదులు చంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఎల్లా రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, భవాని శంకర, నిరంజన్ కుమార్, రవీంద్రారెడ్డి, ఇతర న్యాయవాదులతో పాటు కోర్టు సిబ్బంది, ఆర్అండ్‌బి డిఇ సురేష్‌నాయక్, ఎంపిడిఒ శివశంకర్, సబ్ జైల్ సూపరింటెండెంట్ కె.చంద్రశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్, అర్బన్ సిఐ యుగంధర్, పట్టణ ఎస్ఐ, పంచాయితీ కార్యదర్శి, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైల్లో ప్రధాన న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీ

పీలేరు సబ్ జైలును చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం పీలేరు న్యాయస్థానాల సందర్శన కోసం వచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సబ్ జైలును సందర్శించి అక్కడి ఖైదీలతో న్యాయ విజ్ఞాపన సద స్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సబ్ జైలులోని ఖైదీలకు తగిన సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సదుపాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావచ్చని తెలియజేశారు, ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వం ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఛైర్మన్ 11వ అదనపు జిల్లా జడ్జి ఎ.మహేష్, చిత్తూరు జిల్లా సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జియావుద్దీన్ షేక్, సబ్‌జైలు సూపరింటెండెంట్ కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భవనాలను పరిశీలిస్తున్న చిత్తూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నిరసన

ప్రజాదృష్టి

జిల్లాలో ఇటీవల నిరసనల జోరు పెరిగింది. రాష్ట్రంలోని కూటమి సర్కారు మెడికల్ కళాశాలలను పిపిపి మోడ్‌లో పందేరానికి పెట్టడంపై సర్వత్రా నిరసన వ్యక్తమంది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలను ప్రయివేటుకు దారాదత్తం చేయడంపై ప్రజా సంఘాలు సంతకాల సేకరణ, నిరసనల ద్వారా ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశాయి. ప్రయివేటుకు, పిపిపి విధానానికి తేడా తెలియదా అని కూటమిపెద్దలు ఎదురుదాడి చేయడం విమర్శలకు సైతం నివ్వెరపరిచింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మెడికల్ కళాశాలలపై కన్నేసింది. వైసిపి హయాంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు చేపట్టింది. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు మెడికల్ కళాశాలలను ప్రారంభించకుండా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలకు చెందిన 150పైగా మెడికల్ సీట్లను పేదపిల్లలకు అందకుండా అన్యాయం చేసింది. అనంతరం పిపిపి పేరుతో తమ వందిమాగదులకు 33 ఏళ్ల లీజు పేరిట కట్టబెట్టి పెద్దఎత్తున దోపిడీ చేసుకోవడానికి తెరదీసింది. పిపిపి విధానాన్ని వ్యతిరేకించిన అసమ్మతులను గద్దించడం, బెదిరించడం వంటి సామ, ధాన, బేధ, దండోపాయాల ద్వారా నిరసనకారుల గొంతునొక్కే ప్రయత్నం చేసింది. కడప టిడిపిలో నిరసనల జోరు పెల్లుబికుతోంది. స్వల్పవ్యవధిలోనే అసంతృప్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. టిడిపి కడప నగర కమిటీ దగ్గర నుంచి జిల్లా అధ్యక్ష పదవుల ఎంపిక చేయడం వరకు అసంతృప్తుల సెగ తగులుతోంది. ఫలితంగా కడప జిల్లాలో టిడిపి ప్రాభవం క్రమేణా తరిగిపోతోందనే వాదన వినిపిస్తోంది. కూటమి సర్కారుకు అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలో ఇంతటి స్థాయిలో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడం దేనికి సంకేతమో ఆలోచించుకోవాలి. గండికోట పర్యాటక ప్రాజెక్టు అభివృద్ధి పనులకు బిజెపి ఎమ్మెల్యే, ఎంపీల మధ్య నెలకొన్న అనైక్యత అడ్డంకిగా మారిన సంగతి తెలిసిందే. బిజెపి నాయకుల మధ్య సయోధ్య కుదిర్చే వ్యవహారాన్ని కలెక్టర్‌కు అప్పగించడం ఏమిటో తెలియడం లేదు. గండికోట పర్యాటక ప్రాజెక్టు దగ్గర జరిగిన అడ్డంకుల గురించి కలెక్టర్‌కు తెలియకుండా ఉండదనే సంగతిని గ్రహించాలి. కలెక్టర్ పరిధిలో పరిష్కారమయ్యే వ్యవహారమైతే ఎప్పుడో పరిష్కరించి ఉండేవారనడంలో సందేహం లేదు. కలెక్టర్ పరిధిని దాటడం వల్లే పీఠముడి ఏర్పడింది. ఈ పరిస్థితిని అర్థం చేసుకోని సిఎంఒ బంతిని కలెక్టర్ కోర్టులోకి విసరడం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదనే వాదన వినిపిస్తోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బహుదా ప్రాజెక్టు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ

ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లిలోని బహుదా ప్రాజెక్టు వద్ద, అహోబిలనాయని చెరువు వద్ద ఎస్ఐ తిప్పేస్వామి ప్రమాద హెచ్చరిక బోర్డులను శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా నిమ్మనపల్లి బహుదా ప్రాజెక్టుకు వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగిందన్నారు. ప్రాజెక్టును సందర్శించడానికి సందర్శకులు వస్తున్నందున ముందస్తుగా ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. అహోబిలనాయిని చెరువు పూర్తిగా నిండి మోరవపో తుందన్నారు. ఇక్కడ సయ్యద్‌షావల్లి దర్గా ఉండడంతో ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో వస్తుంటారని చెప్పారు. ఇక్కడ కూడా పోలీసుల ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈత కోసం, చేపల వేట కోసం, ఇతర సరదాల కోసం బహుదా ప్రాజెక్టులోకి, చెరువులోకి వెళ్ళవద్దని హెచ్చరించారు. బహుదా ప్రాజెక్టు వద్ద ప్రాజెక్టు నిర్వాహకులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

మాజీ జడ్‌పిటిసికి పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం

అనారోగ్యంతో భాధపడుతున్న రామపురం మాజీ జడ్‌పిటిసి నాగసుబ్బారెడ్డిని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. మండల మాజీ జడ్‌పిటిసి నాగసుబ్బారెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకొని శనివారం హసనాపురం గ్రామానికి విచ్చేసి ఆయనను పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు కొలిమివాండ్లపల్లి సింగిల్‌విండో సొసైటీ డైరెక్టర్ సహదేవరెడ్డి గ్రామ నాయకులు బసిరెడ్డి, ఖాదర్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

29న బి.కొత్తకోట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మండల సాధారణ సర్వసభ్య సమావేశం 29న స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ అబ్దుల్ షకూర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో చర్చించనున్నారన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని రావాలన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిపి, జడ్‌పిటిసి, ఎంపిటిసిలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

మట్టి ప్రమిదలకు పెరిగిన ఆదరణ

ప్రజాశక్తి-గాలివీడు

మట్టితో తయారుచేసిన ప్రమిదలు

దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలో గేటు, బస్టాండ్, హైస్కూల్ ప్రాంతాల వద్ద మట్టితో తయారుచేసిన దీపాలకు ప్రజాదరణ ఎక్కువగా లభిస్తున్నది. అనేకమంది ప్రజలందరూ వచ్చి మట్టి దీపాలను కొనుక్కొని వెళుతున్నారు. ప్రస్తుతం మట్టి ప్రమిదలను వాడేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తుండటంతో తయారీ దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో మట్టి ప్రమిదలకు గిరాకీ లేక నష్టపోయేవారమని, ప్రస్తుతం దీపావళి పండుగ సందర్భంగా మట్టి ప్రమిదలను విక్రయించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. పట్టణంలో తోపుడుబండ్ల, చిల్లర దుకాణాల్లో మట్టి ప్రమిదలు దర్శనమిస్తున్నాయి.

ప్రతి ఇంటిలో దీపావళి వెలుగులు నిండాలి : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట : దీపావళి పండుగ ప్రతి కుటుంబం సంతోషంగా జరుపుకోవాలని, ప్రతి ఇల్లు దీపావళి వెలుగులతో నిండాలని రాజంపేట నియోజకవర్గం చమర్తి జగన్ మోహన్‌రాజు ఆకాంక్షించారు. శనివారం పట్టణ పరిధిలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి టపాసుల దుకాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శలువా కప్పి, పుష్పగుచ్చం అందజేసి షాపుల యజమాన్యం ఘనస్వాగతం పలికారు. అనంతరం చమర్తి మాట్లాడుతూ ప్రజలు ఆనందంగా దీపావళిని ఘనంగా జరుపుకోవాలని, ప్రతి కుటుంబంలో పిల్లలు, యువత టపాసులు కాల్చేటప్పుడు ప్రతి ఒక్కరూ చాలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

శాస్త్రీయ పరిజ్ఞానం కోసమే చెకిముకి ప్రతిభా పరీక్షలు

ప్రజాశక్తి-వీరబల్లి

శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించడం కోసమే చెకిముకి పరీక్షలు తోడ్పడుతాయని మట్లి జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న అన్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో జరిగే సంఘటనల పట్ల చుట్టూ ఉండే పరిసరాల పట్ల సరైన అవగాహన ను శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా వాళ్ళ సకారత్మకంగా ఆలోచించేటట్లుగా విచక్షణ, సృజనాత్మకతను పెంపొందించుకొనేటట్లుగా తోడ్పాటు నివ్వడమే చెకుముకి విజ్ఞాన శాస్త్ర ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెకుముకి ప్రతిభా పరీక్షల ప్రశ్నాపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తున్న జయన్న

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

ప్రజాశక్తి-కలకడ

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని సర్పంచ్ విశ్వనాథనాయుడు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యం పరిరక్షణ వంటి కార్యక్రమాలపై అవగాహన కలిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు సహకరించాలన్నారు. పంచాయతీలో ఉన్న సచివాలయం పరిధిలో మొక్కలు నాటే కార్య క్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె:** స్వచ్ఛమైన గాలితోనే మనం ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చని ఎంపిడిఒ రమేష్ బాబు అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజు, ఎంఇఒపద్మావతిలతో కలిసి స్వచ్ఛమైన గాలి ఆరోగ్యవంతమైన జీవితం అనే అంశంపై అవగాహన కల్పించి సచివాలయ ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఇఒలు పద్మావతి, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **నందలూరు :** పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని డివిజనల్ పంచాయతీ అధికారి మస్తాన్‌వల్లి అన్నారు. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ - దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్య నారాయణ, ఎంపిడిఒ కెఆర్‌ఎం ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ సునీల్, నాగిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి సురేష్, రామ్మోహన్, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, పారిశుధ్య సిబ్బంది కార్మికులు పాల్గొన్నారు. **రాయచోటి అర్బన్:** రాయచోటిని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మున్సిపల్, మెప్మా అధికారులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు, ప్రజలు మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి బస్టాండ్ రోడ్డు మీదుగా నేతాజీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. సర్కిల్లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ ఆంధ్ర బి స్వచ్ఛంద దివస్ యొక్క ముఖ్య ఉద్దేశాన్ని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ రవి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రబి స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నట్టు తెలిపారు. **మదనపల్లె అర్బన్ :** మోటా మార్కెట్ యార్డును పరిశుభ్రంగా ఉంచుదామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

కలకడ : మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ, అధికారులు

జంగాల శివరామ్ రాయల్ పేర్కొన్నారు. ఎఎంసి కార్యాలయం వద్ద స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారుమన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెట్లను పెంచటం ద్వారా, ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించడం వల్ల కాలుష్యాన్ని తగ్గించ వచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ జగదీష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రోణూరు బాబు, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు. **గాలివీడు:** మండల కేంద్రంలోని జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌డబ్ల్యూపిసి సెంటర్ స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెసెల్ ఆఫీసర్ వెంకట రత్నం, వఎంపిడిఒ చంద్ర మౌళీశ్వర్, పంచాయతీ కార్యదర్శి బి.ఆంజనేయులునాయక్, ఎంపిఒ రామచంద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు. **వీరబల్లి :** చెట్లను పెంచడం మనందరి బాధ్యతని ఎంపిడిఒ జోహార్‌బాబు తెలిపారు. స్వచ్ఛఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల మహిళా సమాఖ్య ఆవరణంలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ర్యాలీగా వెళ్లి బస్టాండ్ ఆవరణంలో మానవహారం ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం ఖాదర్‌వలీ, హౌసింగ్ ఎఇ వెంకటేష్, ఇఒపిఆర్‌డి వరప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్యమైన జీవితం సాధ్యం అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. చింతపర్తి పిహెచ్‌సి పరిధిలోని మూరేవాండ్లపల్లిలో గాలి కాలుష్యం వలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రపై ర్యాలీ నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, సిహెచ్‌ఒ పుష్పావతి, ఎఎన్‌ఎం అనసూయ, సిబ్బంది కిరణ్, ప్రేమ్‌సాయి, సుజాత పాల్గొన్నారు.

వైద్య విద్యను ప్రయివేటీకరించడం తగదు : 'గడికోట'

రామాపురం : సంతకాల సేకరణలో గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసి ప్రయివేట్ వ్యక్తుల పరం చేసేందుకే సిఎం చంద్రబాబు పిపిపి విధానం తీసుకొచ్చాడని వైసిపి ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. మండలంలో మూడోరోజు శనివారం కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం బండపల్లి కుమ్మరపల్లి గ్రామ పంచాయతీలలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి ముసుగులో కార్పొరేట్ సంస్థలకు, ప్రయివేట్ వ్యక్తులకు దోచి పెట్టడం ప్రజలపై భారలు మోపడం తప్ప చేసింది శూన్యమన్నారు. ఇప్పుడు మరలా పేద వైద్య విద్యార్థులకు అన్యాయం చేస్తూ పిపిపి విధానం అంటూ మాజీ సిఎం వై.ఎస్.జగన్ తీసుకొచ్చిన మెడికల్ కాలేజీలను ప్రయివేట్‌పరం చేయడానికి పూనుకున్నాడని పేర్కొన్నారు. చంద్రబాబు విధానాన్ని ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తూ వైసిపి తలపెట్టిన కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమంలో విరివిగా పాల్గొం టున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి రమణ, మాజీ సర్పంచులు సదిపిరాళ్ల రాంబస్‌రెడ్డి , రమణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి జిల్లా మాని టరింగ్ మాజీ సభ్యుడు సగినాల శివశంకర్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్: వైసిపి ప్రభుత్వం అనుమతులు పొందిన ప్రభుత్వ వైద్య కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పచెప్పారని వైసిపి బిసి సెల్ అధికార ప్రతినిధి విజయభాస్కర్ విమర్శించారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి మంచిగురైన వైద్య కళాశాలలో ఉన్న ప్రభుత్వమే నిర్వహించడం ద్వారా పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పేద విద్యార్థులు కడుపుకొట్టడానికే చంద్రబాబు కళాశాలలు ప్రయివేటీకరణ చేశారన్నారు. ఇప్పటికైనా బాబు కొద్దిగా తెచ్చుకొని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేస్తుంటే దానిపై నుండి ప్రజల దృష్టిని మరలించేం దుకు తామే గూగుల్ కంపెనీ అని రాష్ట్రానికి తీసుకొచ్చి నట్టు చంద్రబాబు గొప్పలు చెప్పుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతుంటే దాన్ని అరికట్టడం చేతకాక ఆ పాపాన్ని వైసిపి నేతలకు అంటగట్టేందుకు ప్రయత్నిస్తున్న నీచమైన వ్యక్తి చంద్రబాబని విమర్శించారు. ఇప్పటి కైనా చంద్రబాబు ప్రజలపై భారాలు మోపే పనులకు స్వస్తి పలకాలని కోరారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- అండర్-19 జిల్లా బాలబాలికల కబడ్డీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఎంపిడిఒ రమేష్‌బాబు, ఎంఇఒ-1 పద్మావతి, ఎంఇఒ-2 నారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ అమృత ప్రియదర్శని అన్నా రు. శనివారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో జిల్లాస్థాయి అండర్-19 విభాగంలో బాల బాలికల జట్టు కబడ్డీ ఎంపిక పోటీలను నిర్వహించారు. అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి డాక్టర్ ఎస్.బాబు, ప్రిన్సిపల్ బి.అమృత ప్రియదర్శని, ఎంపిడిఒ రమేష్‌బాబు, ఎంఇఒలు పద్మా వతి, నారాయణ, అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నాగరాజు కలిసి క్రీడాకారులతో కరచాలనం చేస్తూ, క్రీడల స్ఫూర్తిని తెలియజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అమృత ప్రియదర్శని ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారిని దుశ్శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 30 మండలాల నుంచి సుమారు 150 మంది కబడ్డీ క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. కబడ్డీ ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లాస్థాయికి ఎంపికైన బాల బాలికల జట్లు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొం టారని తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడుతూ గెలుపోటములు అనేవి ఏ రంగంలోనైనా సర్వసా ధారణమని అన్నారు. ఉత్తమ ప్రదర్శనతో పాటు క్రీడా స్ఫూర్తిని

కబడ్డీ జట్టు ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

ప్రదర్శించిన క్రీడాకారులకు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించే అవకాశం కలుగుతుందన్నారు. కబడ్డీ పోటీలను ఆదర్శ పాఠశాలలో నిర్వహించడానికి, క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ప్రిన్సిపల్ అమృత ప్రియదర్శని సమర్థవంతంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజాద్‌అలీఖాన్, పిడిఎస్ అసోసియేషన్ ప్రెసిడె ంట్ నరేష్‌బాబు, విఆర్‌ఒ హేమాంబర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సెలక్షన్ కమిటీ సభ్యులు శారద, మోహన్, ఆన్సర్‌బాషా, ఇందిరా, మణి, ఆదర్శ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు తూము లీకేజీకి మరమ్మతులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట : నగర పంచాయతీ సమీపంలోని బయగాని చెరువు తూముకు లీకేజీ ఏర్పడింది. శనివారం రైతులు, నీటి సంఘం ఉపాధ్యాక్షులు మద్దేపల్లి శంకర, రైతులు తలారి రవి,బాలాజి తదితరులు వారి సొంత నిధులతో కలిసి తూము చుట్టూ ఉన్న ముళ్ల కంపలను తొల గించి లీకేజీని ఆపేశారు. చెరువు కింద పొలం ఉన్న రైతు లు ఇబ్బంది పడుతున్నందున, లికేజీని ఆపే చర్యలు చేపట్టారు. నీటి వృధా భవిష్యత్తు తరాలకు ప్రశ్నార్థకంగా మారు తుందన్నారు.

చెరువులో ముళ్ల కంపను తొలగిస్తున్న కూలీ

పీలేరులో టపాకాయల దుకాణాలు ఏర్పాటు

ప్రజాశక్తి-పీలేరు : దీపావళి పండుగ సందర్భంగా పీలేరులో టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేశారు. వినియోగదారులకు సౌకర్యంగా స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో 19 టపాకాయల దుకాణాలకు రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు అనుమతులు ఇచ్చారు. టపాకాయల దుకాణాల పరిసరాల్లో మండే వస్తువులు వినియోగించకూడదని ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ అధికారులు ప్రచారం చేపట్టారు. అత్యవసర అగ్ని ప్రమాదాల నివారణ కోసం టపాకాయల దుకాణాల వద్ద ఇసుక, నీరు వంటివి సిద్ధం చేసి ఉంచుకోవాలని టపాకాయల దుకాణదారులకు అధికారులు ముందుగానే సూచించారు. అలా అధిక ధరలకు అమ్ముతున్నారన్న ఫిర్యాదులు తమకు అందిన వెంటనే అలాంటి వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేశారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి-బి.కొత్తకోట : పిటిఎం మండలంలోని కెజిబివి, ఎపిమోడల్ స్కూల్, బూర్లపల్లి ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మహిళా సాధికారిత, బాలికల విద్య ప్రాముఖ్యత, ఆరోగ్యం, ట్రాఫికింగ్, బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, వ్యక్తిగత పరిశుభ్రత, సమాజంలో బాలికల ప్రాముఖ్యత, బాలల హక్కులు, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. బాలికలకు రైటింగ్, స్పీచ్, ఎడ్యుకేషన్, మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతి విభాగంలో మొదటి రెండవ తృతీయ, బహుమతులు అందజేసి బాలికలను అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో బి.కొత్త కోట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి కే.భాగ్యమ్మ, సూపంర్‌వైజర్లు జి.హిజాద్‌ప్యారి, ఎస్.భవాని, రామలక్ష్మి,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శివకుమారి, ఎఆర్. రాజశేఖర్, బుర్లపల్లి హైస్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **చిట్వేలి :** మండల పరిధిలోని జడ్‌పిహైస్కూల్, వెంకటరాజు పల్లి ఉన్నత పాఠశాల, కెజిబివి పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సంద ర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వసుంధరమ్మ, సురేఖరాణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యంగా బాలికల ప్రాధాన్యత, జెండర్ ఈక్వాలిటీలపై విద్యలో బాగా ప్రతిభ కనపరుస్తున్న ప్రతిభావంతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎస్. రవి, తులసి, ఉపాధ్యాయులు కళావతి, సుహాసిని, చెన్నయ్య పోలీస్ సిబ్బంది రాధిక, పురుషోత్తం పాల్గొన్నారు.

విద్యార్థికి బహుమతి అందిస్తున్న భాగ్యమ్మ

విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న జడ్జి తేజసాయి, దాత సుబ్బారాయుడు

ఫ్యాషన్ మోజులో చదువును నిర్లక్ష్యం చేయొద్దు : జడ్జి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

విద్యార్థులు ఫ్యాషన్ మోజులో పడి చదువును నిర్లక్ష్యం చేయొద్దని జూనియర్ సివిల్ జడ్జి పిజె తేజ సాయి అన్నారు. రైల్వే కోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.భాస్కర్ రెడ్డి అధ్యక్షతన ప్రతిభ అవార్డుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించడం ద్వారా వారు రాబోయే పోటీ పరీక్షలలో ఉద్యోగాలు సాధించటానికి అవకాశాలు ఉంటాయన్నారు. కొంతమంది విద్యార్థులు కూడా చదువును నిర్లక్ష్యం చేసి చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని, యువత చెడు మార్గంలో నడువరాదని తెలిపారు. ప్రిన్సిపల్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి అవార్డులు పొందటం చాలా సంతోషమని పేర్కొన్నారు. నగదు పురస్కారాలు దాత పాములపాటి సుబ్బారాయుడ వారి అన్న జ్ఞాపకార్థం ప్రతి తరగతిలో ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతి విద్యార్థులకు రూ.2వేలు, మహిళల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రతి విద్యార్థికి రూ.3వేలు వంతున, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.భాస్కర్ రెడ్డి తండ్రి కీర్తిశేషులు యం.సుబ్బారెడ్డి పేరు మీద కళాశాలలోని అన్ని తరగతుల విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డును, నగదును జడ్జి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సిఐ హేమసుందర్, రైల్వే కోడూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామరాజు, సీనియర్ న్యాయవాదులు శంకరయ్య, గజపతివర్మ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.రమేష్, కళాశాల ఐక్యు ఎసి కో-ఆర్డినేటర్ దయానందం, కళాశాల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రమేష్, కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దాసరి మోషే, విద్యార్థులు పాల్గొన్నారు.

జిఎస్‌టిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి బాలికల జూనియర్ కళాశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం జిఎస్‌టిపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన కళాశాలకు చెందిన వృక్ష శాస్త్ర అధ్యాపకులు నాగిశెట్టి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. రాజంపేట డిప్యూటీ డిఇఒ ఎల్. నాగయ్య, మండల విద్యాశాఖ అధికారి అనంతకృష్ణ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. వస్తువులు, సేవల పై పన్ను గురించి విపులంగా విద్యార్థులకు వివరించారు. ఏ వస్తువు కొనుగోలు చేసినా, ఏ సేవలు ప్రభుత్వం ద్వారా పొందుతున్నామో దానికి ఏ మేరకు పన్ను చెల్లించాల అనే విషయంపై అందరికీ చక్కగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొంటుముక్కల వెంకటరమణ, మస్తాన్, రాజేంద్ర, సంపత్ పవన్ కుమార్, దీపాల సురేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో మెనూ పాటించాలి

ప్రజాశక్తి-సుండుపల్లి

అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు మెనూ ప్రకారం వంటకాలను అందివ్వాలని ఐసిడిసి సూపర్‌వైజర్ తులశమ్మ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రం సుండుపల్లిలోని అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ సహాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సూచిం చారు. పిల్లలను అంగన్వాడీ సెంటర్లకు వచ్చే విధంగా చూసుకో వాలన్నారు. ఉదయం పది గంటలకు కోడిగుడ్లు ఉడికించాలని, కూరగాయలను శుభ్రం చేసు కోవాలన్నారు. పిల్లలకు భోజనం పెట్టేటప్పుడు పిల్లల చేతులను కడిగిం చాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలోనే పెరటితోటను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసిడిసి సూపర్వైజర్లు సుశీల, విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూపర్‌వైజర్ తులశమ్మ

క్రైం కార్నర్

మదనపల్లెలో దారి దోపిడీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లెలో ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి దారి దోపిడీకి గురైయ్యాడు. ఒకటో పట్టణ సిఐ కథనం మేరకు.. నక్కలదిన్నె తాండా సమీపంలోని సత్సంగ్ స్కూల్ వద్ద నివాసముంటున్న విజయ్‌కుమార్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బెంగుళూరు నుంచి ఆత్మకూరు బస్సులో మదనపల్లెకు బయల్దేరాడు. అర్ధరాత్రి 1గంటకు నక్కలదిన్నెలో తండా వద్ద బస్సు దిగి, ఇంటికి నడుచుకుని వెళుతుండగా, ఇద్దరు యువకులు బైక్ పై వచ్చి లిఫ్ట్ ఇస్తామని బలవంతంగా బైక్‌లో ఎక్కించుకున్నారు. మధ్య దారిలో నిలిపి అతని వద్ద ఉన్న బంగారు చైను, 20వేల నగదు దోపిడీ చేసుకుని వెళ్లిపోయారు. బాధితుడు స్థానిక వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి-రాజంపేట

రాయచోటి-రాజంపేట మార్గంలోని కూచివారిపల్లె వద్ద గల పాల కేంద్రం వద్ద ఇద్దరు విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వస్తూ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఒక విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా మరొక విద్యార్థి గాయాలపాలయ్యాడు. మృతుడు నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు చెందిన మహేంద్ర(19)గా గుర్తించారు. మహేంద్ర బోయినపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థులు ఉదయం కళాశాల నుంచి బాలరాజుపల్లె బ్రిడ్జి వద్దకు ఫోటోలు చిత్రీకరణ కోసం వెళ్లి వస్తూ ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పంచనామా నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్, టెంపో ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-కలకడ

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని రాతికుంటపల్లి పంచాయతీ కోన క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు, ఒక యువకుడికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం ఎల్లుట్ల పంచాయతీ పసలవాండ్లపల్లికి చెందిన మనోహర్ తన ద్విచక్ర వాహనంలో పీలేరుకు వెళ్లి అక్కడ ప్రభుత్వ వసతి గృహంలో చదువుతున్న తన ఇద్దరు కుమార్తెలను తీసుకొని పసలవార్లపల్లెకు వస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కోనక్రాస్ వద్ద గుర్రంకొండ వైపు వెళ్తున్న టెంపో వాహనమును, మనోహర్ వెనుక వైపు నుంచి తన ద్విచక్ర వాహనంతో ఢీకొన్నట్లు చెప్పారు. ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న మనోహర్‌కు తలకు బలమైన రక్త గాయం కాగా, ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలతో బయటపడినట్లు 108 సిబ్బంది పైలెట్ శ్రీనివాసులు, ఇఎంటి బివి.చలపతి తెలిపారు. బాధితులనపు మహల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా కోర్టు, రాయచోటి

M.V.O.P.No. 23/2023

షేక్ మహమ్మద్ రియాజ్.

...పిటీషనరు

Vs

యం. ఇమామ్ సాబ్ వల్లి, S/o యం. రసూల్ సాబ్, డోర్ నెం.1/34, కస్తూరి రాజుగారిపల్లి, దిగువ బత్తినవాండ్లపల్లి, లక్కిరెడ్డిపల్లి, అన్నమయ్య జిల్లా.

మొదటి ప్రతివాదికి నోటీసు

పై నంబరు గల దావా నందు పై కోర్టులో పిటీషనరు నష్టపరిహారం కోసం ప్రతివాదుల అయిన మీ పై దావా దాఖలు చేసియున్నారు. ఇందులో మొదటి ప్రతివాది అయిన మీరు పైన తెలిపిన కోర్టులో 29.10.2025వ తేదీన 10.30 గం॥లకు మీరు గాని, మీ తరపున వకీలు గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో పై కోర్టు వారు మీపై పరోక్షంగా తీర్మానించెదరు.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

పి.సాయి సత్యనారాయణ

పిటీషనర్ తరపు న్యాయవాది,

కడప.

రాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు : రైల్వేకోడూరు

O.S.No. 338/2024 in

O.S.No.132/2023

కట్టా జ్యోతి.

...పిటిషనర్/వాది

Vs

షేక్ షకీలా, భర్త అబ్దుల్ షరీఫ్, డి.నెం.3/505, రంగనాయకుల పేట, రైల్వేకోడూరు టౌన్ అండ్ మండలం, అన్నమయ్య జిల్లా.

...రెస్పాండెంట్/ప్రతివాది

నోటీసు

పై కనిన పిటీషనర్ గౌరవ న్యాయస్థానం ఆదేశించిన ప్రిలిమినరీ డిక్రీ తేది. 01.12.2023 ప్రకారం ఫైనల్ డిక్రీ కొరకు పై కనిన న్యాయస్థానం నందు పై పిటీషన్ రెస్పాండెంట్ అయిన మీ పై దాఖలు చేసియున్నారు. ఇందులకు మీకు ఏమైనా అభ్యంతరాలు యున్న ఎడల పై కనిన కోర్టు నందు 28.10.2025వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై తెలుపుకొనగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఖండితముగా తెలుపడమైనది.

//By Order of the Court//

యం. శంకరయ్య

న్యాయవాది,

రైల్వేకోడూరు.